# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- నాణ్యమైన విద్యతోనే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు.

- ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో సమర్థవంతమైన పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.

- సమాజంలో ఆరోగ్యకరమైన భిన్నాభిప్రాయాలు, పరిణతితో కూడిన చర్చలు అవసరమని సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు.

- బిహార్, మధ్యప్రదేశ్, హరియాణా, చండీగఢ్, సిక్కిం, ఈశాన్య రాష్ట్రాల్లో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = =

నాణ్యమైన విద్యతోనే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో ఈరోజు జరిగిన 'జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు-2026' ప్రదానోత్సవ కార్యక్రమంలో 48 మంది పాఠశాల ఉపాధ్యాయులు, 21 మంది ఉన్నత విద్యాసంస్థల అధ్యాపకులకు అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను గౌరవించే సమాజమే నిజమైన ప్రగతిశీల సమాజమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో విద్యా నైపుణ్యాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దేశ నిర్మాణంలో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులే అసలైన సైనికులని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్... 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో సమర్థవంతమైన పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ అవార్డు గ్రహీతలతో నిన్న ఆయన సంభాషిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయులతో తన సంభాషణ దృశ్యాలను సామాజిక మాధ్యమంలో పంచుకున్న నరేంద్రమోదీ.. పిల్లల్లో విపరీతంగా పెరిగిపోతున్న మొబైల్స్, టీవీల వాడకంపై ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ వ్యసనాన్ని తగ్గించేందుకు క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలవైపు పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ విద్యా విధానాన్ని ప్రస్తావిస్తూ, తరగతి గదులకే పరిమితం కాకుండా విద్యార్థులను వాస్తవ ప్రపంచ నైపుణ్యాలు, పనితీరుతో అనుసంధానం చేయడం ముఖ్యమని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్... 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభంకానున్న 'స్వచ్ఛతా హి సేవా-2026' కార్యక్రమ సన్నాహాలపై కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ దృశ్య మాధ్యమంలో అంతర్ మంత్రిత్వ శాఖల ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. జలశక్తి శాఖా మంత్రి సి.ఆర్. పాటిల్ తో పాటు పలువురు సీనియర్ అధికారులు ఈ భేటీలో పాల్గొని ఏర్పాట్లను సమీక్షించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సామాజిక మాధ్యమం వేదికగా వివరాలను పంచుకున్నారు. స్వచ్ఛతా హి సేవా ఉద్యమం ఈ ఏడాదితో తొమ్మిదో విడతలోకి అడుగుపెడుతున్న సందర్భంగా.. మరింత పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భారతావనిని తీర్చిదిద్దేందుకు దేశం సిద్ధమవుతోందని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ సాధనలో పౌరులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని, ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆకస్మిక వరదలతో నేపాల్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 1,344కు చేరింది. ఇప్పటివరకు సుమారు 13 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, దాదాపు 5 వేల మంది ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఇంకా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. మరోవైపు, ఈ విపత్తు కారణంగా టిబెట్ లో 21 మంది మృతి చెందగా, 500 మందికి పైగా గల్లంతయినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. వరద ప్రభావిత జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెళ్ళ్ లో  చిక్కుకున్న వారిని రక్షించేందుకు నేపాల్, భారత్, చైనా దేశాలకు చెందిన బృందాలు సంయుక్తంగా సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = =

సమాజంలో ఆరోగ్యకరమైన భిన్నాభిప్రాయాలు, పరిణతితో కూడిన చర్చలు అవసరమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఉద్ఘాటించారు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న 'బ్రిక్స్ ప్రధాన న్యాయమూర్తుల ఫోరమ్' సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. సకాలంలో, పారదర్శకంగా న్యాయం అందవలసిన అవశ్యకత వుందని పేర్కొన్నారు. దేశాల మధ్య వాణిజ్యం పెరుగుతున్న కొద్దీ సమర్థవంతంగా పనిచేసే వివాద పరిష్కార వేదికలు అవసరమన్నారు. బ్రిక్స్ సభ్య, భాగస్వామ్య దేశాల మధ్య చర్చలు పెంపొందడానికి, వాణిజ్యం నిరాటంకంగా సాగడానికి మధ్యవర్తిత్వ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

శాసనాలు, సముద్ర వాణిజ్యం నుంచి గణిత శాస్త్రం వరకు భారతదేశం తన స్వంత వారసత్వాన్ని అధ్యయనం చేయడంలోను, తిరిగి దక్కించుకోవడంలోనూ ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన వార్షిక చరిత్ర పురస్కారాల కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. భారతదేశ ప్రాచీన సంస్కృతి, విజ్ఞానం కేవలం మన దేశానికే పరిమితం కాకుండా, ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. వాటిని మన కోణంలోనే అధ్యయనం చేసి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆమె పేర్కొంటూ...

(వాయిస్…22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య వార్షిక అత్యున్నత స్థాయి సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ నెల 26న ప్రసంగించనున్నారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న సర్వసభ్య చర్చలలో భాగంగా ఆయన భారత జాతీయ ప్రకటనను వినిపించనున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధి వద్ద రవాణా అంతరాయాల కారణంగా తలెత్తుతున్న ఆహార, ఇంధన ధరల భారం వంటి ఆర్థిక ఒత్తిళ్ళ నడుమ ఈ అత్యున్నత స్థాయి సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = =

బరువు పెరగకుండా ముందుగా జాగ్రత్త పడడమే, స్థూలకాయం సమస్యను ఎదుర్కొనేందుకు అత్యుత్తమ మార్గమని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ టాండన్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఈరోజు ప్రారంభమైన స్థూలకాయ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఒకసారి మనిషి స్థూలకాయం బారిన పడితే బరువు తగ్గించుకోవడం అత్యంత కష్టమని, తగ్గిన బరువును అలాగే కాపాడుకోవడం మరింత సవాలుతో కూడుకున్నదని ఆయన హెచ్చరించారు. స్థూలకాయం కేవలం జీవసంబంధమైన కారకాల వల్ల మాత్రమే కాకుండా.. ప్రవర్తనాపరమైన, పర్యావరణ, సాంస్కృతిక కారణాల వల్ల కూడా వస్తుందని డాక్టర్ టాండన్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా మహిళల టీ-20 క్రికెట్ ఆసియా కప్-2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. గ్రూప్-A మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్థాన్ జట్టు 8 ఓవర్లు పూర్తయ్యేసరికి 3 వికెట్లు కోల్పోయి 32 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

బిహార్, మధ్యప్రదేశ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరాఖండ్, సిక్కిం, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లో రాగల రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. అండమాన్ నికోబార్ దీవులు, బిహార్, కర్ణాటక, జమ్మూ-కశ్మీర్, లడఖ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, త్రిపుర, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొంటాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాల అవసరాలకు తగినట్లుగా సర్వీస్ రూల్స్ మరింత మెరుగ్గా, బాధ్యతాయుతంగా మార్చేందుకు నిరంతర కృషి జరగాలని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు. ఢిల్లీలో సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ ఫోరమ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలను మరింత పారదర్శకంగా, ఉద్యోగ కుటుంబాల సంక్షేమానికి అనుగుణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యానికి ఈ నూతన కార్యక్రమం అద్దం పడుతోందని పేర్కొన్నారు. సమకాలీన అవసరాలకు అనుగుణంగా గత కొన్ని సంవత్సరాలలో అనేక సర్వీస్ రూల్స్ లో  మార్పులు చేశామని మంత్రి గుర్తుచేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులే తీర్చిదిద్దుతారని కేంద్ర విద్యాశాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి ఉద్ఘాటించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన సామాజిక మాధ్యమం వేదికగా వీడియో సందేశాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ తత్వవేత్త, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =